క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సాయికుమార్

రణస్థలం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కొండములగాం గ్రామ పంచాయతీలో రెడ్డి అప్పలనాయుడు మెమోరియల్ క్రికెట్, వాలీబాల్ పోటీలను వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ నాయకులు పిన్నింటి సాయికుమార్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు గొర్లె అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి వాసు, గ్రామ యువత ఉన్నారు.

భీష్మ ఏకాదశి రోజున లక్షతులసీ దళార్చనలు

శ్రీకాకుళం కల్చరల్: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి ఎనిమిదో తేదీన సామూహిక లక్ష తులసీ దళార్చనలు నిర్వహిస్తున్నట్లు బొంతావారి వీధిలోని కృష్ణార్జున మందిరం ప్రతినిధులు అందవరపు మురికయ్య, రామారావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో 51 మంది దంపతులు, మహిళలచే నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 94410 72762 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

స్వామి వివేకానందకు ఘననివాళి



వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎం పురం క్యాంపస్‌లో ముందస్తు యువజన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ మాట్లాడుతూ.. యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహన కృష్ణచౌదిరి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి



సనపల నారాయణరావు

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జెడ్పీటీసీ మాజీ సభ్యులు సనపల నారాయణరావు తెలిపారు. ఎచ్చెర్లలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యమన్నారు. పదవి వచ్చేందుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోలీసుస్టేషన్ సందర్శన

గార: సంక్రాంతి సమయంలో గ్రామాల్లో శాంతిభద్రతలు విఘాతం కలగకుండా చూడాలని, ముమ్మురంగా తనిఖీలు చేపట్టి అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సీహెచ్ వివేకానంద సిబ్బందికి సూచించారు. శనివారం సాయంత్రం గార పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ పైడపునాయుడు, ఎస్ఐ ఆర్. జనార్దన ఉన్నారు.

ఓబన్నకు ఘన నివాళి

శ్రీకాకుళం క్రైమ్: బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన వడ్డే ఓబన్న జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.వి.రమణ ఆధ్వర్యంలో ఓబన్నకు పోలీసులు ఘనంగా నివాళులర్పించారు.

18 నుంచి ప్రథమ చికిత్సపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ప్రథమ చికిత్సపై ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు ఇండియన్ రెడ్‌క్రాస్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో రెడ్‌క్రాస్, సెయింట్ జాన్ అంబులెన్స్ సౌజన్యంతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు శనివారం తెలిపారు. పరిశ్రమలలో పనిచేసేవారు, వ్యాపారులు, దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం 91330 08585, 99486 33398 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

శ్రీకాకుళం క్రైమ్: సంక్రాంతి పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని, ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. శనివారం రాత్రి ఏడురోడ్ల కూడలి వద్ద డీఎస్పీ ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు.

ఆంజనేయస్వామిపై ప్రవచనం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉపనిష్మందిరంలో 'పంచముఖ ఆంజనేయస్వామి వైభవం'పై ఆధ్యాత్మిక ప్రవచనం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వక్త ఇప్పిలి రామకృష్ణ మాట్లాడుతూ.. ఆంజనేయస్వామికి ఉన్న తొమ్మిది అవతారాలలో ముఖ్యమైంది పంచముఖ ఆంజనేయ వైభవం అన్నారు. ఈ సందర్భంగా వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. సనపల నారాయణమూర్తి, బలివాడ మల్లేశ్వరరావు, పసుమర్తి మనోహర్ పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా!

- దొంగలు పడతారు జాగ్రత్త
- ఇప్పటికే భారీ చోరీలతో హడలెత్తిస్తున్న దుండగులు
- పోలీసులకు ముందస్తు సమాచారం ఇస్తే మేలు
- అందుబాటులో ఎల్‌హెచ్ఎంఎస్ సేవలు



ఆటో ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ :

సంక్రాంతి రానే వచ్చింది. పిల్లలకు సెలవులు ఇవ్వడంతో నగరంలో అధిక శాతం మంది సొంత గ్రామాలకు వెళ్తున్నారు. ఇదే అదనుగా దొంగలు ఇళ్లల్లో చొరబడే ప్రమాదమున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు హితవు పలుకుతున్నారు. క్యాంపులకు వెళ్లేవారు పోలీసులకు ముందస్తు సమాచారమిచ్చి ఎల్‌హెచ్ఎంఎస్ సేవలు వినియోగించుకుంటే మరింత మేలని చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

స్వగ్రామాలకు, క్యాంపులకు వెళ్లేముందు ఇంటికి తాళాలు వేసేటప్పుడు పక్కింటివారికి సమాచారమిచ్చి కాస్త ఇళ్లు చూడమని చెప్పాలి. వీలైతే దగ్గరలో ఉన్న సచివాలయ పోలీసులకు తెలియజేయాలి.

- ఎక్కువ రోజులు బయటకు వెళ్తే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలి. ఎల్‌హెచ్ఎంస్ ద్వారా వీరికి భద్రత కల్పిస్తారు.
- ప్రతిఒక్కరూ ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అపార్ట్‌మెంట్లో వాచ్‌మెన్ తప్పనిసరిగా ఉండాలి.
- అపరిచిత వ్యక్తులు తారసపడితే 100కు గానీ, 112కు గానీ డయల్ చేసి పోలీసులకు తెలియజేయాలి.
- మంచినీళ్ల కోసం, సహాయం కోసం వచ్చేవారు అనుమానాస్పదంగా ఉంటే తలుపులు తీయకుండానే మాట్లాడి పోలీసులకు ఫోన్ చేయాలి.
- ఆటోల్లో, బస్సుల్లో ప్రయాణించేటప్పుడు విలువైన బంగారం, నగదు బ్యాగుల్లో భద్రపరిచి గమనిస్తుండాలి.
- షాపింగ్ చేసేటప్పుడు ప్రజలు తమ బ్యాగులు, పర్సులు ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. పిక్‌పాకెటర్స్ ఉంటారు. ద్విచక్ర వాహనాలు, కార్లకు హ్యాండ్‌లాక్ తప్పనిసరిగా వేసుకోవాలి.

ఎస్పీ ఆదేశాలతో..



ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాలతో డే అండ్ నైట్ బీట్ వ్యవస్థ పెంచాం. స్పెషల్ పెట్రోలింగ్ పార్టీలు తిరుగుతాయి. లాడ్జీలు, బస్‌స్టేషన్లు, దేవాలయాలు, ముఖ్య కూడళ్లు, ఏటీఎం సెంటర్లు, షాపింగ్ మాల్స్‌ల వద్ద తనిఖీలు ముమ్మరం చేశాం. నిర్మానుష్య ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్‌కు అవకాశాలెక్కువ. మార్కెటింగ్‌కు, మాల్స్‌కు వెళ్లేవారు ఆభరణాలు ధరించి వెళ్లకపోతే ఉత్తమం. కొన్ని శాఖలు, ఇతరత్రా మారు పేర్లు పెట్టుకుని ఇళ్లకు వస్తుంటారు. వివరాలు ఆరా తీయాలి.

– సీహెచ్ వివేకానంద, డీఎస్పీ, శ్రీకాకుళం

ఆధారాలు చూపించాలి..



రాత్రి వేళల్లో బయట తిరిగే వారికి తప్పక ఐడీ కార్డు ఉండాలి. తిరిగేందుకు కారణం కూడా సరైనదై ఉండాలి. అర్ధరాత్రి సినిమా చూసి వచ్చేవారు టికెట్లు క్షుణ్ణంగా పరిశీలించి వెళ్లారా లేదా అన్నది నిర్ధారించుకుంటాం. లేదంటే కఠిన చర్యలు తప్పవు..

– ఎం.హరికృష్ణ, శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ

అప్రమత్తం చేస్తున్నాం..



ఊర్లెళ్లేముందు సమాచారమిస్తే ఎల్‌హెచ్ఎంఎస్‌లో భాగంగా సీసీ కెమెరాలు అమర్చి ఇంటి యజమాని మొబైల్‌కు, పోలీస్ కంట్రోల్ రూమ్‌కు జీపీఎస్ ద్వారా అనుసంధానిస్తాం. ఎల్‌హెచ్ఎంఎస్‌పై నగరవాసులకు తెలియకపోవడం, తెలిసినా వినియోగించుకోకపోవడం బాధాకరం. ప్రజలకు అర్థమయ్యేలా కరపత్రాలు పంపిణీ చేస్తున్నాం.

– పి.ఈశ్వరరావు, రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ

అప్రమత్తంగా..



అనుమానాస్పద వ్యక్తులు కనిపించేటప్పుడు పోలీసులకు సమాచారమివ్వాలి. క్యాంపులకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులు, డాక్యుమెంట్లు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. లేదంటే వెంట తీసుకుపోవాలి. ముందుగా సమాచారమిస్తే పరిసరాల్లో పోలీస్ బీట్ పెడతాం.

– సీహెచ్ పైడపునాయుడు, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ

రూ.51.58 కోట్లతో రోడ్ల నిర్మాణం



మాట్లాడుతున్న డీఈఈ శ్రీరాములు

జి.సిగడాం: ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో 51.58 కోట్ల రూపాయలతో రోడ్ల పనులు చేపడుతున్నట్టు పంచాయతీరాజ్ శాఖ డీఈఈ ఎస్.శ్రీరాములు తెలిపారు. పాలఖండ్యాం గ్రామంలో విలేకరులతో శనివారం మాట్లాడారు. ఎమ్మెల్యే ఎన్ఈఆర్ కృషితో రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. ఎచ్చెర్ల మండలంలో రూ. 7.76 కోట్లతో 124 సీసీ రోడ్ల పనులు, రూ. ఒకకోటితో బీటీ రోడ్డు నిర్మాణం, రణస్థలం మండలంలో రూ. పదికోట్లతో 94 సీసీ రోడ్లు, రూ. 6.75 కోట్లతో ఐదు బీటీ రోడ్ల పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. లావేరు మండలంలో రూ. 6.16 కోట్లతో 132 సీసీ రోడ్లు, రూ. 4.70 కోట్లతో మూడు బీటీ రోడ్డు పనులు చేపడుతున్నట్టు వెల్లడించారు. జి.సిగడాం మండలంలో రూ. 5.69 కోట్లతో 157 సీసీ రోడ్లు, ఎనిమిది బీటీ రోడ్ల కోసం రూ. 9.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పనులను శరవేగంగా.. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ చేపడుతున్నామన్నారు. ఏఈఈలు కె.సత్యనారాయణ, కె.హేమలత, ఎస్.వి.ఎస్ పోలినాయుడు ఉన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

ఎచ్చెర్ల: సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లావేరు ఎస్సై జి.లక్ష్మణరావు హెచ్చరించారు. శనివారం ఆయన లావేరు పోలీసు స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. పండుగ రోజుల్లో సంప్రదాయ క్రీడలు పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కోడి పందేలు, పేకాట, చెక్కబొమ్మ లాంటి ఆటలను ఆడి ప్రజలు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

పొన్నాడలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



చెత్తను తొలగిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నేతింటి యమున పనులను పర్యవేక్షించారు. రోడ్డు పక్కల్లో జంగిల్ క్లియరెన్స్ , డ్రైనేజీలు, రోడ్లను శుభ్రం చేశారు. సంక్రాంతి నేపథ్యంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టామని సర్పంచ్ చెప్పారు.

దవళపేటలో వస్త్రదానం రేపు

జి.సిగడాం: దవళపేట గ్రామంలో ఈనెల 13వ తేదీన పీవీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా పేదలకు వస్త్రదానం చేయనున్నారు. ఈ విషయాన్ని ఆ సంస్థ చైర్మన్ పేడాడ రామ్మోహన్‌రావు శనివారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి పీవీఎస్ భార్గవ్‌శంకర్, తేజేంద్రశంకర్ ద్వారా వస్త్రదానం ఉంటుందన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని కింతలమిల్లు జంక్షన్ వద్ద ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రథసప్తమి టెండర్లు పూర్తి

అరసవల్లి: రథసప్తమి పర్వదినం మూడు రోజుల పాటు నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం నిర్వహించిన టెండర్ల ప్రక్రియ ముగిసింది. ప్రధానంగా విద్యుత్ అలంకరణ పనులను స్థానిక విద్యుత్ కాంట్రాక్టర్ ఉంగటి పాపారావుకు దక్కగా, క్యూలైన్లు పనుల కాంట్రాక్ట్ పి.మౌళికి, రంగుల వేయుటకు డి.రాజారావుకు టెండర్ దక్కింది. ఫొటోలు, వీడియోలు, ఎల్ఈడీ స్క్రీన్లు, డ్యూటీ సిబ్బందికి భోజనాల ఏర్పాటు నెగోషియేషన్ కోసం చర్యలు చేపడుతున్నట్లుగా ఈవో భద్రాజీ ప్రకటించారు. షామియానాలు, కార్పెట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు టెండర్లకు ఎవ్వరూ హాజరుకాలేని కారణంగా వాయిదా వేస్తున్నట్టు ఈవో వై.భద్రాజీ ప్రకటించారు. పరిశీలకునిగా శ్రీకూర్మం ఆలయ ఈవో గురునాథరావు, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ పాల్గొన్నారు.

ఘనంగా కూడార్యై ఉత్సవం

- 108 వెండి గిన్నెలతో స్వామివారికి నైవేద్యం



పాల్గొన్న భక్తులు




నారాయణ తిరుమలలో వెండిగిన్నెలలో చక్రపొంగలి నివేదన



కోదండ రామాలయంలో వెండిగిన్నెలలో నివేదన

శ్రీకాకుళం కల్చరల్: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో ఆలయాలలో కూడార్యై ఉత్సవం వైభవంగా శనివారం జరిగింది. కూడార్యై వెల్లుం పాశురం చదువుతూ 108 వెండి గిన్నెల్లో స్వామికి చక్రపొంగలి ప్రసాదం నివేదన చేసి వేడుకలు జరిపారు. పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామిని పూలతో అలంకరించి అర్చన చేశారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు కూడార్యై పాశురం చదివి గోదాదేవి రంగనాథుని వేడుకున్న విధానాన్ని భక్తులకు వివరించారు. వెండి గిన్నెల్లో స్వామికి ఆరగింపు నివేదన చేసిన అనంతరం భక్తులకు పంచారు. స్వామికి నక్షత్ర హారతిని సమర్పించారు. ముందుగా స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, సామూహికంగా విష్ణు సహస్రనామా పారాయణ జరిగింది. అలాగే పాలకొండ రోడ్డులోని కోందరామాలయం లో నిర్వహించిన కూడార్యై ఉత్సవంలో అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు నిర్వహణలో అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు 108 వెండి గిన్నెల్లో ప్రసాదం నైవేద్యం చేశారు. చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు శ్రీనివాచార్యులు ఆధ్వర్యంలో కూడార్యై ఉత్సవం సందర్భంగా 108 ఇత్తడి గిన్నెలలో స్వామివారికి పాయసం నివేదన చేసి భక్తులు పంచారు.



చిన్నబజారులో స్వామికి 108 గిన్నెలలో నివేదన

ముగిసిన గ్రామసభలు

- 18న సామాజిక తనిఖీ ప్రజావేదిక



గార పంచాయతీలో సామాజిక తనిఖీ గ్రామసభ

గార: మండల వ్యాప్తంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులు, వివిధ శాఖల ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం చేపట్టిన నివేదికలపై జరిగిన గ్రామసభలు శనివారంతో ముగిశాయి. 25 పంచాయతీలకు సంబంధించి రూ. 26.26 కోట్లు విలువైన పనులపై ఈ నెల 18న సామాజిక తనిఖీ ప్రజావేదిక జరుగుతుందని, పలు నిర్ణయాలపై చర్చ జరుగుతోందని ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు శనివారం తెలిపారు. గార, రామచంద్రాపురం, కె.మత్స్యలేశం, కె.సైరిగాం, గొంటి, సతివాడ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామసభలను ఐసీడీఎస్ పీడీ రాధామాధవి పర్యవేక్షించారు. సమావేశాల్లో సర్పంచ్‌లు మార్పు దుర్గాపృథ్వీరాజ్, గొలివి వెంకటరమణమూర్తి, బి.లలిత, మార్పు రమణ, చల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మేలుకొలుపు



జి.సిగడాం మండలంలోని పలు గ్రామాల్లో మేలుకొలుపుల సందడి నెలకుంది. 28 రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ధనుర్మామాసం సందర్భంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు గ్రామాల్లో పర్యటిస్తూ భక్తి గీతాలు ఆలపిస్తున్నారు. శనివారం పాలఖండ్యాం, పెంట, నాగులవలస, మద్రివలస, సంతవురిటి గ్రామాల్లో భజన బృందం ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. పాలఖండ్యాంలో మాజీ సర్పంచ్ పలిశెట్టి సూర్యనారాయణ పర్యవేక్షణలో మేలు కొలుపు జరిగింది.

–జి.సిగడాం

ధర్మవరంలో కబడ్డీ పోటీలు..



స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామంలో మేము సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో అండర్–19 మండల స్థాయి కబడ్డీ పోటీలను శనివారం ప్రారంభించారు. సంస్థ అధ్యక్షులు టీకె ఆచారి వివేకానంద విగ్రహానికి పూలమాలను వేసి లాంఛనంగా ప్రారంభించారు. పోటీలలో సుమారు 15 జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బి.నాగేశ్వరరావు, క్రీడాకారులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

–ఎచ్చెర్ల

రంగనాథస్వామి ఊరేగింపు..




జి.సిగడాం మండల కేంద్రంలో వెలసిన రంగనాథస్వామి ఆలయంలో విష్ణుమూర్తిని శనివారం ఆలయ కమిటీ సభ్యులు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా తిరువీధి నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–జి.సిగడాం

వేంకటేశ్వరునికి ద్వాదశి పూజలు



మొండేటివీధిలోని వేంకటేశ్వరస్వామికి ద్వాదశి నివేదనలు



పాతశ్రీకాకుళం కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కూడార్యై పూజలు

శ్రీకాకుళం కల్చరల్: ధనుర్మాసం సందర్భంగా నగరంలోని మొండేటివీధిలో ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ద్వాదశి పూజలు శనివారం వైభవంగా జరిగాయి. అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. స్వామివారికి ప్రత్యేకంగా అలంకరణ చేశారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. అలాగే పాతశ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు బూరడ వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. శివబాలాజీ ఆలయంలో కూడా కూడార్యై ఉత్సవం సందర్భంగా స్వామివారికి 108 గిన్నెలతో పాయసం నివేదన చేశారు. పాండ్రంగి వీధిలో కూడా కూడార్యై ఉత్సవం జరిగింది.

బైరిలో మినీ గోకులం ప్రారంభం



గోకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్: మండలంలోని బైరి గ్రామంలో మినీ గోకులాన్ని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోకులాలు ఏర్పాటుతో వ్యవసాయానికి సాయంగా ఉంటుందన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు అవ్వాలన్నదే గోకులాల ముఖ్య ఉద్దేశమన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ పి.వి.జి. బాలక్రిష్ణ, తిరుపతిరావు, డాక్టర్ దిలీప్ పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి..



శ్రీకాకుళం న్యూకాలనీ: ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో చిన్నారులకు భోగి పండ్లుపోసి ఆశీర్వదిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం న్యూకాలనీ:వాడాడలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి వేడుకల్లో ఉపాధ్యాయులు



శ్రీకాకుళం కల్చరల్: ఆర్చరీ అకాడమీలో సంక్రాంతి సంబరాలు

ముందస్తు సంక్రాంతి సంబరాలు శనివారం పలుచోట్ల జరిగాయి. శ్రీకాళం నగరంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో పాఠశాల డైరెక్టర్ ఎ.లావణ్యరాణి ఆధ్వర్యంలో చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వాడాడ జంక్షన్‌లో ఉన్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో అకడమిక్ డైరెక్టర్లు సత్యప్రసాద్, రమేష్, ప్రిన్సిపాల్ అర్జున్ చక్రవర్తి పాల్గొన్నారు. అరసవల్లిలోని ఆదిత్యా ఆర్చరీ ఆకాడమీలో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ చెటికం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు ఎస్సై వి.సందీప్‌కుమార్ చెప్పారు. ఎచ్చెర్ల స్టేషన్‌లో ఆయన శనివారం మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రశాంత వాతావరణమే లక్ష్యమన్నారు. పేకాట, కోడిపందాలు, డొక్కు ఆట వంటి వాటిపై ప్రత్యేక నిఘా పెడుతున్నామన్నారు. ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలన్నారు.